కంకర పరిచి.. రోడ్డు మరిచి

- మూడేళ్లుగా అసంపూర్తిగానే వెంబాయి–ఎలికట్టె రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చిట్యాల: గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యతనిచ్చేందుకు గాను బీటీ రోడ్డు నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులు కేటాయించారు. ఈ పనులకు అధికారుల తో కలిసి ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న వారే లేరు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిట్యాల మండలంలోని మొగిలిదోరి గ్రామం నుంచి ఎలికట్టె గ్రామం మీదుగా నార్కట్‌పల్లి మండలంలోని బ్రహ్మణవెల్లెంల గ్రామం వరకు సుమారుగా 12కిలోమీటర్ల దూరం వరకు ఉన్న లింకు రోడ్లను బీటీ రోడ్డుగా మార్చేందుకు సుమారుగా రూ.5కోట్ల నిధులు కేటాయించారు. బీటీ రోడ్డుగా మారి వాహనదారులకు ఇబ్బందులు తీరుతాయనుకుంటే పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నార్కట్‌పల్లి మండలం బ్రహ్మణవెల్లెంల నుంచి చిట్యాల మండలం ఎలికట్టె గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్ చిట్యాల మండల పరిధిలోని ఎలికట్టె–వెంబాయి గ్రామాల మధ్య పనులను అసంపూర్తిగా వదిలేశారు. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. గత మూడేళ్లుగా రోడ్డు ఇదే పరిస్థితిలో ఉంది. ఈ కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన గడువు వస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపటం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని కంకర పరిచిన రోడ్డుపై బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎలికట్టె–వెంబాయి గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.


చిట్యాల: కంకర పోసి వదిలేసిన వెంబాయి–ఎలికట్టె రోడ్డు

బీటీ పనులు పూర్తిచేయాలి

ఎలికట్టె–వెంబాయి గ్రామాల మధ్య గతంలో మట్టిరోడ్డు ఉండేది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉండేది. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరటంతో బీటీ రోడ్డుగా చేసేందుకుగాను నిధులు మంజూరు చేశారు. కానీ పనులు ప్రారంభించి మూడేళ్లు దాటినా బీటీ రోడ్డు పనులు జరగడం లేదు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– ఒరుగంటి వెంకన్న, ఎలికట్టె

నిధుల విడుదల జాప్యంతో పనులు నిలిచిపోయాయి

ఎలికట్టె– వెంబాయి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మట్టి రోడ్డుకు ఇరువైపులా అవసరమైన చోట కల్వర్టు నిర్మాణాల పూర్తి కావడంతోపాటు కంకర పరచటం వరకు పనులు జరిగాయి. మిగిలిన పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయడం లేదు. నిధుల విడుదలలో జాప్యంతో బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరో మూడు నెలల్లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తవుతాయి.

– సందీప్‌రెడ్డి, పీఆర్ ఏఈ

రైతులకు యూరియా అందించాలి


రాస్తారోకో చేస్తున్న రైతులు

శాలిగౌరారం : యూరియా కోసం శాలిగౌరారంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన నకిరేకల్–గురజాల రోడ్డుపై శనివారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసుకుంటే యూరియా సమయానికి వేయకపోతే పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

నల్లగొండ టౌన్: సుక్క దీవనమ్మ జ్ఞాపకార్థం ఆమె మనుమరాలు నిషిత సుమాంజలి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ 320 ఈ గవర్నర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. సుక్క దీవెనమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం నల్లగొండలోని మదర్ థెరిసా హోమ్‌లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిస్ జోన్ చైర్ పర్సన్ పసలపూడి ఝాన్సీ రాణి, లయన్ అన్ని ప్రీతి, మదర్ థెరిస్సా హోమ్ సిస్టర్స్ పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం రాత్రి వరకు మూసీ రిజర్వాయర్‌కు 7,111 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 6,510 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టాన్ని 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. మూసీ రిర్వాయర్‌లో ప్రస్తుతం 4.07 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

క్లుప్తంగా

మాథ్స్ ఒలింపియాడ్‌లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ


ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): అసోసియేషన్ ఆఫ్ మాథమెటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా మాథ్స్ ఒలింపియాడ్‌లో నల్లగొండ ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి మాథ్స్ ఒలంపియాడ్ 2025కు ఎంపికై నట్లు పాఠశాల డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వాణి అభినందించారు.

కందుకూరి సుదర్శన్‌కు మెమొంటో అందజేత


మెమొంటో అందుకుంటున్న సుదర్శన్

రామగిరి(నల్లగొండ): మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్న కందుకూరి సుదర్శన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అభినందించారు. నమ్మొద్దు నమ్మొద్దు మూఢనమ్మకాలు, ఎయిడ్స్, డ్రగ్స్, బాల కార్మికులపై సామాజిక గీతాలు ఆలపించినందుకుగాను శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి దుర్గా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, నర్సింగ్ కోటయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

1న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్: సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు, కార్మికులతో ధర్నాలు నిర్వహించనున్నట్లు టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిల్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నా అనంతరం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సుకు తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మునుగోడు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత తీర్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ మండల ఇన్‌చార్జ్ కాసాల జనార్దన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, మధుసూదన్ రెడ్డి, నరేందర్ గౌడ్, నర్సింహ, విష్ణు పాల్గొన్నారు.

చెరుకు సుధాకర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న చెరుకు సుధాకర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ జన్మదిన వేడుకలను శనివారం నకిరేకల్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరయ్యారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

నల్లగొండ: ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐ ఎండీ జాఫర్, హెడ్ కానిస్టేబుల్ బక్కయ్యలను జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సన్మానించారు. గత సంవత్సరం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ మోహన్ గుండె పోటుతో మృతి చెందగా.. ఆయన సతీమణి స్వాతికి చేయూత ద్వారా రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వినాయకుడి లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు


సోనూ సోయల్‌కు లడ్డూ అందజేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

చిట్యాల: చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ముస్లిం విద్యార్థి సోనూ సోయల్ రూ.6,516లకు లడ్డూను దక్కించుకున్నాడు. అదేవిధంగా మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో ఒకటవ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద నిర్వహించనున్న అన్న ప్రసాదానికిగాను అదే గ్రామానికి చెందిన బియ్యమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ ఫాతిమా 50కేజీల బియ్యం అందజేశారు.

కొనసాగుతున్న సీపీఎం ఇంటింటి సర్వే

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యల పై సర్వే కొనసాగుతోంది. శనివారం ఖమ్మగూడెం, శేరిగూడెం, నెర్మట గ్రామాల్లో సీపీఎం శ్రేణులు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బండ శ్రీశైలం, వల్లూరి శ్రీశైలం, పబ్బు మారయ్య, ఎల్లయ్య, శివ, ప్రశాంత్, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకురాలు కందాల ప్రమీల కోరారు. శనివారం నకిరేకల్‌లోని 9, 10 వార్డుల్లో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

తిప్పర్తి: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి వెంకటరమణారెడ్డి అన్నారు. గత మూడు రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా శనివారం సర్వారం, సిలార్‌మియాగూడెం, రాయినిగూడెం, రాజుపేట గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మన్నెం భిక్షం, లింగయ్య, ఉమ, సైదులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

మర్రిగూడ: మర్రిగూడ మండలంలోని సరంపేటలో శ్రీస్తంభగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట కల్యాణ మండపం మధ్య శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. స్థానికుల సమాచారంతో పోలీసులు శనివారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. తవ్వకాలపై ఆలయ ధర్మకర్త మారెపల్లి నర్సింహాచార్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.


ఆలయం ఎదుట తవ్వడంతో ఏర్పడిన గుంత

వైకుంఠ రథం అందజేత

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ వీరమళ్ల శ్రీశైలం తన తాత, నాయనమ్మలు వీరమళ్ల డేగయ్య, పాపమ్మ, సత్తెమ్మల జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠ రథంను శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం తల్లిదండ్రులు వీరమళ్ల యాదయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

క్యారంబోర్డులు పంపిణీ

మర్రిగూడ: మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో గ్రామానికి చెందిన పందుల పాండుగౌడ్ శనివారం క్యారంబోర్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊరిపక్క జంగయ్య, పోతురాజు, ఆంజనేయులు, మహ్మద్ జావిద్, మైలారపు గిరీష్, యాదమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు

నల్లగొండ టౌన్: క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డీఎస్పీ శివరామిరెడ్డి తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన రన్నింగ్ పోటీల విజేతలకు శనివారం ఆయన తన కార్యాలయంలో బహుమతులు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడాపోటీల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జిల్లా క్రీడల అధికారి ఎండీ యాకూబ్ అలీ మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సమయమివ్వాలి

రామగిరి(నల్లగొండ): ఓటర్ల జాబితాను సరి చేసేందుకు సరైన సమయం ఇవ్వాలని మండలానికి చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు డిమాండ్‌చేశారు. ఓటర్ జాబితా, పోలింగ్ బూత్‌లపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 31 గ్రామాల జాబితాలను ఎంపీడీఓ యాకుబ్ నాయక్ ప్రతినిధులకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓటర్ జాతితా కూర్పులో గ్రామాల్లోని బీఎల్‌ఓ, పంచాయతీ కార్యదర్శులు విఫలమయ్యారన్నారు. 4 సంవత్సరాల క్రితం చనిపోయిన వారి పేర్లు కూడా నేటికీ లిస్టులో ఉన్నాయన్నారు. ఒక ఊరికి చెందిన ఓట్లు ఇంకో గ్రామంలో చేర్చారని పేర్కొన్నారు. రసూల్‌పూర, రెడ్డికాలనీలో ఓటరు జనాభాకు మించి ఓట్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నుంచి సైదులు, సతీష్, బీఆర్‌ఎస్ నుంచి దీప వెంకట్‌రెడ్డి, శంకర్, బీజేపీ నుంచి అనిల్‌కుమార్, సీపీఎం నుంచి పాలడుగు నాగార్జున, సత్యనారాయణ పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా

తిప్పర్తి: ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని పలు రాజకీయ పార్టీల నాయకులు ఆరోపించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు ముసాయిదా జాబితా పరిశీలనపై పలు రాజకీయ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబంలోని ఓట్లన్ని ఒకే చోట చేర్చలేదని, మరణించిన వారి పేర ఉన్న ఓట్లను తొలగించలేదని ఆరోపించారు. మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఓటరు జాబితాను తప్పులు లేకుండా సవరించాలని, కుటుంబ సభ్యులందరు ఒకే వార్డులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, నాయకులు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, మన్నెం భిక్షం, రవి, ముత్తినేని శ్యాం సుందర్, కందుల లక్ష్మయ్య పాల్గొన్నారు.


రామగిరి(నల్లగొండ): సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

చిట్యాల: గ్రామ పంచాయతీ ఎన్నికలకుగాను రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చిట్యాలలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూపొందించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలుసుకున్నారు.

అభ్యంతరాలను తెలపాలి

నార్కట్‌పల్లి : ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. శనివారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఓటర్ లిస్టు సవరణపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను స్వీకరించారు. సమావేశంలో ఎంపీఓ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీను, దుబ్బాక శ్రీధర్, సైదులు పాల్గొన్నారు.

మునుగోడు: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ల సమీపంలోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు కోరారు. ఓటరు జాబితా, వార్డుల విభజనతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాల స్వీకరణకుగాను శనివారం మునుగోడులోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ యుగేందర్ రెడ్డి, వివిధ పార్టీల మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

చండూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణలపై శనివారం చండూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు ఉంటే గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన వార్డుల వారీ ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని ఎంపీడీఓ బండారు యాదగిరి సూచించారు. సమావేశంలో అఖిల పక్ష నాయకులు నలపరాజు సతీష్, తిప్పర్తి రాములు, కట్ట భిక్షం, వెంకన్న, ముదిగొండ ఆంజనేయులు, ధనుంజయ్ పాల్గొన్నారు.

2న తుది ఓటరు జాబితా

గట్టుప్పల్ : వచ్చేనెల 2న తుది ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా వెల్లడించనున్నట్లు ఎంపీడీఓ మాధవరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నకిరేకల్: పంచాయతీ తుది ఓటర్ల జాబితా ప్రకటనపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు కోరారు. పంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన నేపథ్యంలో శనివారం నకిరేకల్ ఎంపీడీఓ కార్యాలయంలో అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు నకిరేకంటి ఏసుపాదం, రాచకొండ వెంకట్‌గౌడ్, పన్నాల రాఘవరెడ్డి, ప్రగడపు నవీన్‌రావు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ చినమునయ్య తెలిపారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎంకు వినతి

నకిరేకల్: శాసన సభ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని శనివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాదపూర్వకంగా కలిశారు. నకిరేకల్ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రామన్నపేట, చిట్యాల మండలాలకు బస్వాపూర్ ప్రాజెక్టు నుంచి సాగు, తాగు నీరు అందించాలని సీఎంను కోరారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వేముల వీరేశం

వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ

చిట్యాల: మున్సిపాలిటీలోని పదో వార్డులో శ్రీమంజునాథ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద శనివారం కోటగిరి శివ అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా శ్రీనివాస జనరల్ స్టోర్స్ ఎదుట ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సాయికృష్ణ షాపింగ్ మాల్ యజమాని శివకోటి యాదగిరి, గోల్డ్ స్మిత్ బజారులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద యిమ్మడి రాంబాబు, తొమ్మిదవ వార్డులో ఎంజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ఎదుట పాటి నర్సిరెడ్డి, పదో వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద కంచర్ల వెంకన్న, ఈశ్వరయ్యలు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

అంజయ్యకు సన్మానం

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య ఉద్యోగ విరమణ పొందడంతో శనివారం ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ పద్మ మాట్లాడుతూ.. ఉద్యోగ కాలంలో చేసిన సేవలు ప్రజలు మరిచిపోరన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సృజనాకుమారి, విజయలక్ష్మి, వెంకటరత్నం, జాన్ ఖాన్, సునిత తదితరులు పాల్గొన్నారు.


అంజయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ పద్మ

రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వినతి


కోదండరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆత్మ చైర్మన్ జగాల్ రెడ్డి

కనగల్: రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఆత్మ చైర్మన్ జగాల్ రెడ్డి కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతి పత్రం అందజేశారు. జగాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు హార్టికల్చర్ యూనివర్సిటీ మంజూరు చేయాలని కోరారు. సబ్సిడీ పనిముట్లు అందజేయాలని, బత్తాయి రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. రైతు వేదికల వద్ద ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఆత్మ డైరెక్టర్ హఫీజొద్దీన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని చదును చేసిన సంఘటనపై విచారణ

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు (శివనేనిగూడెం)లో ప్రభుత్వ భూమిని ఇటీవల చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించాడని ఆ వార్డుకు చెందిన సైదులుపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు తహసీల్దార్ కృష్ణనాయక్ శనివారం తెలిపారు. వ్యవసాయ భూమిలోకి వెళ్లేందుకుగాను ప్రభుత్వ భూమిని చదును చేసినట్లుగా సైదులు తెలిపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల మండల కార్యవర్గం ఎన్నిక

కేతేపల్లి: కేతేపల్లి మండల రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాసర్ల వెంకట్‌రెడ్డి (బొప్పారం), చిమట కృష్ణయ్య(భీమారం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పులిచింతల సత్తిరెడ్డి సమక్షంలో రేషన్‌డీలర్ల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం కేతేపల్లిలో ఎన్నుకున్నారు. సంఘం కోశాధికారిగా అలుగుబెల్లి పద్మ, ఉపాధ్యక్షులుగా బండారు శ్రీదేవి, సహాయ కార్యదర్శిగా యడవెల్లి నర్సయ్య, కార్యవర్గసభ్యులుగా జడ ఆంజనేయులు, గాదరి రాములు, నకిరెకంటి వెంకటరత్నం, ముత్తినేని స్వర్ణలత ఎన్నికయ్యారు. సమావేశంలో రేషన్ డీలర్లు ఊర ముత్తయ్య, పసుపులేటి మాధవి, పిచ్చయ్య, మంజుల, నరహరి పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు


మునుగోడు: క్యాంపు కార్యాలయంలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


రామాలయంలో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్


నార్కట్‌పల్లి: పూజల్లో పాల్గొన్న రేగట్టె నర్సింహారెడ్డి తదితరులు


నల్లగొండలోని ఎస్‌ఆర్ కాలేజీలో గణేష్ నిమజ్జన ఊరేగింపు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


దివ్యాంగుల హాస్టల్‌లో అన్నదానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి